క్లుప్తంగా

వాసవీమాత శోభాయాత్ర


నృత్యం చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

వేమనపల్లి: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవీమాత శోభాయాత్ర హోరెత్తింది. వారం రోజుల క్రితం మండల కేంద్రంలోని విశ్వేశ్వరాలయంలో కన్యకపరమేశ్వరి (వాసవీ)మాతను ప్రతిష్ఠించారు. నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శనివారం ప్రాణహిత నదీస్నానానికి వెళ్లి రాగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. డీజే చప్పుళ్లు, భక్తిపాటలతో మహిళలు నృత్యం చేశారు. అనంతరం మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శోభాయాత్రలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గణపురం మధుకర్, కృష్ణమూర్తి, సంతోష్‌కుమార్, దండెశ్రీ వెంకన్న, ప్రదీప్, దారం నగేష్, తిరుమలేష్, ఎల్క శ్రీనివాస్, శ్రీరాములు, వెంకటరమణ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నెన్నెల: ప్రగతిశీల యువజన సంఘం (టీవైఎల్) ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 3న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీవైఎల్ రాష్ట్ర నాయకులు మనోహర్ పిలుపునిచ్చారు. మండలంలోని మైలారంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వేలాది మందితో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు మహేష్, గంగన్న, వినోద్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: సిరిసిల్ల మినీ స్టేడియంలో శనివారం తెలంగాణ శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం నిర్వహించిన జోనల్‌స్థాయి స్పోర్ట్స్ అండ్‌గేమ్స్‌లో మంచిర్యాల శ్రీ చైతన్య పాఠశాల ఓవరల్ ఛాంపియన్‌గా నిలిచింది. పోటీల్లో 16బ్రాంచీలకు చెందిన పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోబిన్, పీఈటీలు రాజేందర్, విలాస్, అక్షయ్, అనూష అభినందించారు.

ఆర్థికసాయం

జన్నారం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 1991–92సంవత్సరంలో పదో తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. తమతో పాటు చదువుకున్న కామన్‌పల్లి గ్రామానికి చెందిన తేజావత్ ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా చేయిచేయి కలిపి రూ.14700 సేకరించి బాధిత కుటుంబానికి ఆదివారం అందించి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నరేందర్, నీలయ్య, సత్యనారాయణ, నర్సయ్య, రమేశ్, బాపన్న పాల్గొన్నారు.

కార్మికుడికి పరామర్శ

శ్రీరాంపూర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆర్కే 5 గని సపోర్ట్ మెన్ మేకల రోహిత్‌ను ఐఎన్టీయూసీ నాయకులు పరామర్శించారు. ఆదివారం ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, నాయకులు మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కొట్టే తిరుపతి తదితరులు శ్రీరాంపూర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పంచాయతీ భవనం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎంపీపీ

దండేపల్లి: మండలంలోని కాసిపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మెరుగైన వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించేందుకు ఈజీఎస్ నిధులతో కొత్త భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు మైదం యశోద, బిల్లకూరి శంకరయ్య, ఎంపీటీసీలు మల్లవ్వ, మణెమ్మ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో చేతివాటం

- చెన్నూర్‌లోని మార్కెట్ యార్డులో వాహనాలకు టోకెన్లు
- టోకెన్లు లేకున్నా పత్తి అమ్మకాలు
- ఆందోళనలో పత్తి రైతులు


కిష్టంపేటలోని ఓ జిన్నింగ్ మిల్లు వద్ద నిలిచి ఉన్న పత్తి వాహనాలు

చెన్నూర్‌రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టింది. సీసీఐ ద్వారా పత్తి క్వింటాలుకు రూ.7020ఉండగా, గత వారం నుంచి క్వింటాల్‌కు ధరను రూ.6920వరకు నిర్ణయించారు. అదే ప్రైవేటులో రూ.6500 మొదలుకొని రూ.6600వరకు చెల్లిస్తున్నారు. రైతులు పత్తిని అమ్ముకునేందుకు జిన్నింగ్ మిల్లులకు వెళ్తున్నారు. చెన్నూర్ మండలంలో మొత్తం నాలుగు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. శివలింగాపూర్‌లో ఒకటి, కిష్టంపేటలో రెండు, చెన్నూర్‌లో ఒక మిల్లు ఉంది. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం, జైపూర్ మండలాల నుంచి పత్తిని అమ్ముకునేందుకు రైతులు చెన్నూర్‌కు తీసుకువస్తున్నారు. పత్తి వాహనాలను నేరుగా జిన్నింగ్ మిల్లులకు తీసుకు వెళ్లకుండా, చెన్నూర్‌లోని మార్కెట్ యార్డుకు తీసుకువెళ్లాలని, అక్కడే తేమశాతం చూసి మండలంలోని ఏ మిల్లుకు వెళ్లాలనేది సీసీఐ అధికారులు టోకెన్లను అందజేస్తున్నారు. దీంతో దూర ప్రాంతం నుంచి వచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

తేమశాతం 8 ఉంటేనే సీసీఐలో మద్దతు ధర...

డీసీఎం వ్యానులో ఒక రైతు కేవలం 40క్వింటాళ్ల పత్తిని మాత్రమే తీసుకురావాలి. ఒకసారి ఒక రైతు పేరిట 40క్వింటాళ్ల పత్తిని సీసీఐలో అమ్మిన తర్వాత, మళ్లీ అదే రైతు పేరిట పత్తిని అమ్మేందుకు వీలు కాదు. అలాగే పత్తిలో 8తేమశాతం వస్తేనే సీసీఐ ధర చెల్లిస్తున్నారు. 8శాతం కంటే ఎక్కువగా తేమ వస్తే ధరను తగ్గిస్తున్నారు. 9శాతం తేమ వస్తే పత్తిలో క్వింటాల్‌కు రూ.70 తగ్గిస్తున్నారు. ఇలా తేమశాతం ఎక్కువగా వస్తే వాహనంలో ఎన్ని క్వింటాళ్ల పత్తి ఉందో క్వింటాల్‌కు రూ.70చొప్పున ధరను తగ్గిస్తున్నారు.

పత్తి అమ్మకాల్లో చేతివాటం...

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు చెన్నూర్‌లోని మార్కెట్ యార్డుకు వచ్చి తేమశాతం చూసిన అనంతరం ఏ మిల్లుకు పంపాలో టోకెన్లు ఇస్తున్నారు. సీసీఐ అధికారులు కేటాయించిన మిల్లుకు టోకెన్‌తో పత్తి వాహనాన్ని తీసుకువెళ్లిన తర్వాత మళ్లీ మిల్లులో పత్తిలో తేమశాతం చూసి ధరను నిర్ణయిస్తున్నారు. కానీ కొన్ని పత్తి మిల్లుల్లో అధికారులు, మిల్లు వారు కలిసి చేతివాటం చూపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. శనివారం మార్కెట్ యార్డులో తేమశాతం చూసిన అనంతరం టోకెన్లు తీసుకొని రాత్రి కిష్టంపేటలోని ఓ జిన్నింగ్ మిల్లుకు వెళ్లిన తర్వాత మిల్లులో తేమశాతం చూసిన అనంతరం వాహనాల నుంచి పత్తిని అన్‌లోడ్ చేయకుండా ఆపేశారు. ఇతర ప్రాంతాల నుంచి అదే మిల్లు వారికి సంబంధించిన డీసీఎంఎస్ వాహనంలో 40క్వింటాళ్ల పరిమితికి మించి 80క్వింటాళ్ల పత్తిని తీసుకొచ్చి, మార్కెట్ యార్డు నుంచి ఎలాంటి టోకెన్ లేకున్నా సీసీఐ ద్వారా కొనుగోలు చేసినట్లు వాహనంలోని పత్తిని దింపుకున్నారు. మా వాహనాలకు టోకెన్లు ఉన్నా, తేమశాతం పేరుతో వాహనాల నుంచి పత్తిని అన్‌లోడ్ చేయకుండా, టోకెన్లు లేకుండా వేరే ప్రాంతం నుంచి వచ్చిన వాహనాల నుంచి పత్తిని ఎలా అన్‌లోడ్ చేశారని సదరు రైతులు గొడవకు దిగారు. దీంతో అధికారులు, మిల్లు యజమానులు, ఏమీ తోచక టోకెన్లు ఉన్న రైతుల వాహనాల నుంచి పత్తిని అన్‌లోడ్ చేయించారు. అందరికీ ఒకే న్యాయం ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుతున్నారు.


ఓ జిన్నింగ్ మిల్లులో శనివారం రాత్రి అధికారులు, మిల్లు యజమానులతో వాగ్వాదంలో రైతులు

టోకెన్లు ఉంటేనే పత్తిని అన్‌లోడ్ చేసుకోవాలి

పత్తి వాహనాలు చెన్నూర్‌లోని మార్కెట్ యార్డుకు రావాలి. అక్కడ పత్తిలో తేమశాతం చూసిన అనంతరం వాహనాలు ఏ మిల్లుకు వెళ్లాలో టోకెన్లు అందజేస్తున్నాం. టోకెన్లు లేకుండా మిల్లులకు ఏ వాహనం వెళ్లినా, ప్రైవేటులో తప్పా సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేపట్టడం జరగదు. శనివారం రాత్రి జరిగిన సంఘటన మా దృష్టికి రాలేదు. దాని గురించి మేము తెలుసుకున్న అనంతరం చర్యలు తీసుకుంటాం.

– గజానన్ మార్కెటింగ్, ఏడీ, మంచిర్యాల

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తా

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచినా, ఓడినా ప్రజా సమస్యల కోసం తాను ఎళ్లవేళలా పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా, వాటిని ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలకు రూ.25కోట్ల చొప్పున రూ.75కోట్లను కేటాయించగా, లక్సెట్టిపేట్‌లో 212, మంచిర్యాలలో 347, నస్పూరులో 374పనులను గుర్తించి, వాటిని ప్రారంభించామని, వాటిని కొత్త ప్రభుత్వం ఎందుకు రద్దు చేసిందో ప్రజలకు వివరించాలన్నారు. మూడు మున్సిపాలిటీల్లో ప్రతిరోజు దాదాపుగా సగం వార్డులకు పైగా తాగునీటిని ఇస్తున్నామని, ఇందుకోసం దాదాపుగా రూ.70కోట్లకు పైగా నిధులతో పైప్‌లైన్ పనులు చేశామని, అమృత్ పథకం కింద మంచిర్యాల మున్సిపాలిటీకి రూ.48.50కోట్లు తెప్పించామన్నారు. మూడు మున్సిపాలిటీల్లో తాగునీటిని తాము ఇచ్చామని, కానీ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే మాత్రం నెల రోజుల్లోనే ప్రతిరోజు శుద్ధమైన తాగునీటిని ఇవ్వగలుగుతున్నామంటున్నారని ఎద్దేవ చేశారు. నిధులన్నింటినీ తమ ప్రభుత్వం విడుదల చేస్తే, కనీసం వాటిని పూర్తి చేయడంలో ప్రస్తుత ఎమ్మెల్యే విఫలం అయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, వార్డు కౌన్సిలర్లు సుదమల్ల హరికృష్ణ, అంకం నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీ గ్రౌండ్‌లో 5వ వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో మోమినపుర ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్)క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. ఫైనల్‌లో గెలుపొందిన మోమిన్‌పుర రైజర్స్ జట్టుకు రూ.10 వేలు, రన్నర్స్‌గా నిలిచిన మోమిన్‌పుర జట్టుకు రూ.5వేలను వార్డు కౌన్సిలర్ అందించారు.

'వారి సేవలు మరువలేం'

శ్రీరాంపూర్: విద్యారంగంలో వారు చేసిన సేవలు మరువలేనివని కోల్‌బెల్ట్ నస్పూర్ మండల ప్రైవేట్ పాఠశాల సంఘం నాయకులు తెలిపారు. ఇటీవల మృతి చెందిన బెల్లంపల్లికి చెందిన రాజా విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎస్ రాజారెడ్డి, శ్రీరాంపూర్‌కు చెందిన విశ్వశాంతి కరస్పాండెంట్ రాయపూడి రాఘవ, ఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ గాజుల రాజయ్యలకు ఆదివారం నస్పూర్‌లోని శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల సంఘం నాయకులు బత్తిని దేవన్న, రేగళ్ల ఉపేందర్, సబిహా సుల్తానా, గోపతి సత్తయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఇబ్రహీం, మహేందర్, అమన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారంలో కొన్ని రోజులుగా తాగునీరు సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గ్రామస్తులు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు.

గూడు కోసం గోడు


గంగారంలో కవర్లు, బొంతలు కప్పిన పూరి గుడిసె

- గుడిసెల్లోనే గడుస్తున్న బతుకులు
- వర్షాలు వస్తే తప్పని తిప్పలు
- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపులు

నెన్నెల: ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా పేదోడి పరిస్థితి మాత్రం మారడం లేదు. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు. గత 25ఏళ్లుగా శిథిలమవుతున్న గుడిసెల్లోనే కాలం వెల్లదీస్తున్నారు. ఎప్పుడు కూలుతాయో తెలియదు. వాన వస్తే నీరు దారలై పారుతుంది. గట్టి గాలివానకు పైకప్పు ఉంటుందో.. ఊడిపోతుందో తెలియదు. బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడపాల్సిన పరిస్థితి. సొంతింటి నిర్మాణం కళగానే మిగులుతోంది. అదిగో డబుల్ బెడ్‌రూం ఇల్లు, ఇదిగో గృహలక్ష్మి ఇల్లు అంటుండటమే తప్పా ఆచరణలో అమలు కావడం లేదు. వర్షాలకు గోడలు తడిసి అవి ఎప్పుడు కూలుతాయోనని భయాందోళన మధ్య జీవనం గడుపుతున్నారు. మండలంలో 19గ్రామ పంచాయతీలు ఉండగా, 34 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 24వేల జనాభాలో సుమారు 6200మంది గుడిసెల్లోనే బతుకుతున్నారు. కాగా ఇందులో అధిక శాతం గిరిజనులు, దళితులు ఉండడం గమనార్హం.

పట్టించుకునేవారేరి?

ఏళ్ల నుంచి మాపై రాజకీయ నాయకులకు చిన్నచూపే. ఓట్ల కోసం సమావేశాలు, సభల కోసం మేము పనికి వస్తాం, మా అవసరాలను మాత్రం పట్టించుకునే నాథుడే లేడు అని పేదలు వాపోతున్నారు. మండలంలోని గూడు లేని గుడిసెలు, పక్కా ఇళ్లు లేని తాటి, ఈత కమ్మలతో పాటు వరిగడ్డి గుడిసెలను నిర్మించుకొని కవర్లు, బొంతలు కప్పుకొని ఎండ, వాన, చలికి తలదాచుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ కనికరించి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తారని ఎదురుచూస్తున్నారు.

తప్పని ఎదురుచూపులు..

మండలంలోని పలు గ్రామాల్లో పూరిగుడిసెల్లో చిన్న, చిన్న పెంకుటిళ్లలో నివసిస్తున్న జనం వందల సంఖ్యలో ఉన్నారు. వారికి పక్కా ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని కోణంపేట, జంగాల్‌పేట, ఖర్జీ, దమ్మిరెడ్డిపేట, కొత్తూర్, గంగారాం, నెన్నెల, మైలారం, చిత్తాపూర్ నార్వాయిపేట గ్రామాల్లో నివసిస్తున్న పేదల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు వస్తే తమ సమస్యలు తీరుతాయని ఎదురుచూస్తున్నారు. నేటికి మండలంలోని పలు గ్రామాల్లో పక్కా ఇళ్ల ఊసే లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమలాంటి వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గిరిజనులు, నిరుపేదలు కోరుతున్నారు.

ఇప్పటి వరకు ఇల్లు లేదు..



చుట్టు పొరకల దడి కట్టుకొని మా ఇద్దరి పిల్లలతో నలుగురం ఇరుకుటంగా మెలుగుతున్నాం. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇస్తామని చెప్పి రాసుకొని పోయారు. ఇప్పటి వరకు ఇల్లు దిక్కు లేదు. వర్షం, గాలి వచ్చినప్పుడు ఇద్దరు పిల్లలతో బిక్కుబిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వమైన ఆదుకోవాలి.

– రాంటెంకి శోభారాణి, కోణంపేట

భయంతో గడుపుతున్నాం



వర్షానికి, చలికి, ఎండకు తట్టుకుంటూ తలదాచుకుంటున్నాం. గాలి దుమారం వస్తే ఎప్పుడు కూలిపోతుందోనని భయం వేస్తోంది. కవర్లు గాలికి లేచిపోతున్నాయి. ఇద్దరు పిల్లలతో ఈ చిన్న గుడిసెలో ఉండటం ఇబ్బంది అవుతుంది. సర్కారు మాలాంటోళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలి.

– మేకల లక్ష్మి, నెన్నెల

బాధ్యతలు స్వీకరణ

చెన్నూర్ సీఐగా రవీందర్


బాధ్యతలు స్వీకరిస్తున్న రవీందర్

చెన్నూర్: పట్టణ సీఐగా కె.రవీందర్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చెన్నూర్‌లో విధులు నిర్వర్తించిన సీఐ వాసుదేవరావు మల్టిజోన్–1 ఐజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కె.రవీందర్ రాజన్న సిరిసిల్ల సీసీఎస్ నుంచి చెన్నూర్‌కు బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన రవీందర్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం సీఐకి పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరాంపూర్ సీఐగా బన్సీలాల్



శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన సీఐగా ఆర్.బన్సీలాల్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్ బాబు రామగుండంకు బదిలీ కాగా, ఆయన స్థానంలో బెల్లంపల్లి వన్‌టౌన్‌లో పనిచేస్తున్న బన్సీలాల్ ఇక్కడికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. బాధ్యతలు చేపట్టడానికి వచ్చిన ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు.

కోటపల్లి సీఐగా సుధాకర్



కోటపల్లి: కోటపల్లి నూతన సీఐగా సుధాకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా విద్యాసాగర్‌ను రామగుండం కమిషనరేట్‌కు బదిలీ చేయగా, పెద్దపల్లి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న సీఐ సుధాకర్ కోటపల్లికి బదిలీపై వచ్చారు. మండలంలో శాంతిభద్రతలకు సహకరించాలని, ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ సుధాకర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సీఐలు


దేవయ్య


అఫ్జలుద్దీన్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లికి కొత్తగా బదిలీపై వచ్చిన ఇద్దరు సీఐలు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐగా ఎన్.దేవయ్య, బెల్లంపల్లిరూరల్ సీఐగా సయ్యద్ అఫ్జలుద్దీన్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వీరికి పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు.

కార్యవర్గాలు

నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్...



చెన్నూర్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ చెన్నూర్ యూనిట్ ఎన్నికలను స్థానిక ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఎన్నికల అధికారి పొన్న మల్లయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీఎన్‌జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి హాజరయ్యారు. చెన్నూర్ యూనిట్ అధ్యక్షుడిగా మామిడి రాజన్న, ఉపాధ్యక్షుడి స్వామిదాస్, ప్రధాన కార్యదర్శిగా కుమురం అభిషేక్, సంయుక్త కార్యదర్శిగా రజిత, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎండీ నవీద్‌అహ్మద్, కోశాధికారిగా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా పబ్బా సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా సాబీర్, ఎం.విజయ, మానస ఎన్నికయ్యారు.

రేషన్ డీలర్ల సంఘం...

మందమర్రిరూరల్: అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ మంజునాథ గార్డెన్‌లో రేషన్ డీలర్ల సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 59మందికి గాను 57మంది డీలర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. కల్లూరు అనిల్, మల్యాల రాయమల్లు అధ్యక్ష పదవికి పోటీ పడగా, 30ఓట్లతో కల్లూరు అనిల్ విజయం సాధించారు. కాగా రాయమల్లుకు 26 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు చెల్లలేదు. జనరల్ సెక్రటరీగా కమల్, ట్రెజరరీగా రాచర్ల అనిల్ ఎన్నికయ్యారు.

టీఎన్‌జీవోల...

లక్సెట్టిపేట: మండలంలోని టీఎన్‌జీవో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి అతీష్‌కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా భూమన్న, కార్యదర్శిగా వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సమీముద్దీన్, పబ్లిసిటీ కార్యదర్శి రామక్రిష్ణ, ట్రెజరరీ శ్రీనివాస్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు వాణి, గోవర్ధన్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అడ్‌హాక్ కమిటీ..

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం ఆదిజాంబవ జన జాగృతి సేన సంఘం అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా తుంగపిండి శంకర్, శనిగారపు కుమార్, వాసాల సంపత్, నెరువట్ల రాయలింగు, సంగి రవి, గజ్జల చందర్, కొలుగూరి విజయ్‌కుమార్, రేణికుంట్ల కొమురయ్య, ఆర్నకొండ ఆంజనేయులు ఉన్నారు.

అభయాంజనేయ ఆలయ కమిటీ..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో గల శ్రీఅభయాంజనేయ స్వామి రాజరాజేశ్వర సహిత దేవాలయ కమిటీని ఆదివారం వార్డు కౌన్సిలర్ బదావత్ ప్రకాశ్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఆలయ చైర్మన్‌గా మురుక్కుంట్ల లింగమూర్తి, వైస్ చైర్మన్‌గా సంతోశ్ ఎన్నికయ్యారు.

వర్తక సంఘం...

జన్నారం: మండల వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం గౌరవ అధ్యక్షుడు మల్యాల బాపన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వొజ్జల వామన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జక్కు రమేశ్, కోశాధికారిగా కొమురవెల్లి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా గోలి రవి, గుండ సుధాకర్, శీల శ్రీనివాస్, బండారు రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా గోలి చందు, ఉత్తూరు అరవింద్, మల్యాల శ్రవణ్, బండారు రాజన్న, సభ్యులుగా ఎర్ర సంపత్, శ్రీనివాస్, రాజు, గంగాధర్, శ్రీనివాస్‌లను నియమించారు.

మాల మహానాడు బాధ్యుల నియామకం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మాల మహానాడు రాష్ట్ర బాధ్యులను ఆదివారం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రామ్మూర్తి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టయ్య అధ్యక్షతన నియమించారు. హాజీపూర్ మండల అధ్యక్షుడిగా ఆశాది ప్రవీణ్‌కుమార్, హాజీపూర్ గ్రామ అధ్యక్షుడిగా దామెర దినేశ్‌కుమార్‌లతో పాటు రాష్ట్ర కార్యదర్శిగా జూపాక ధర్మయ్యలను నియమిస్తూ నియామక లేఖలు అందజేశారు.

ఘనంగా కంకాలమ్మ, కేతేశ్వరస్వామి జాతర


పూజలు చేస్తున్న జాన్సన్ నాయక్


జాతరకు హాజరైన మంచిర్యాల డీసీపీ, ఏసీపీలు

జన్నారం: మండలంలోని ఈర్లగుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. మహేంద్ర సంఘం సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. మండలంతో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురు జాతరకు హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొనకల్ ఎంపీటీసీ గుండవరం హరిణి, మధుసూధన్‌రావు దంపతులు అన్నదానం చేశారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, సర్పంచ్ భూమేశ్ తదితరులు హాజరై పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, సభ్యులు రాజన్న, కనకయ్య, అశోక్, మల్లయ్య, తదితరులు జాతర ఏర్పాట్లను పరిశీలించారు.

ఎలక్ట్రీషియన్ దినోత్సవం

చెన్నూర్: పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ భవనంలో ఆదివారం ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు సఫ్దర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.